# సిలికానాంధ్ర మనబడి సాంస్కృతికోత్సవం 2013 – డాలస్ – సమీక్ష

సమీక్షకులు - రాయవరం విజయ భాస్కర్, కాజ సురేశ్

డాలస్ తెలుగు వారికి ఈ మహాశివరాత్రి మరింత పర్వదినమయ్యింది. స్థానిక యు.టి. ఆర్లింగ్టన్ లోని టెక్సాస్ హాల్ లో మార్చి తొమ్మిదిన అంగరంగ వైభవముగా జరిగిన నాలుగవ “సిలికానాంధ్ర మనబడి సాంస్కృతికోత్సవం” నిజంగా తెలుగు వారికి, తెలుగు భాషాభిమానులకి అచ్చమైన పండుగ దినం. మూడువందల అరవై అయిదు మంది మనబడి బాలబాలికలు తమతమ తల్లితండ్రులతోనూ, గురువులతోనూ, స్నేహితులతోనూ కలిసి వచ్చి కార్యక్రమాన్ని కన్నులపండువగ “స్వీయనిర్వహణ”లో రక్తికట్టించారు. దాదాపు పన్నెండు వందలమంది ఆహుతుల మధ్యలో, షుమారు ఎనిమిది గంటల పాటు సాగిన కార్యక్రమము, నిర్వాహకుల, స్వచ్ఛందసేవకుల అకుంఠిత దీక్షవలన, “పిల్లల చేత పిల్లలకోసం పిల్లలు చేసిన” కార్యక్రమం, ఆద్యంతము ఆహ్లాదముగా ఆనందముగా సాగింది. తెలుగు తల్లి ఊరేగే పల్లకికి మనందరము బోయిలమే, తెలుగు భాషాభివృద్ధికి మనందరి సమిష్టి కృషి ఎంతైనా అవసరము అనే విషయము మరోసారి తేటతెల్లమయ్యింది. తెలుగుని ప్రాచీన భాష నుంచి ప్రపంచభాషచెయ్యడానికి మార్గాలని తమ వ్యాఖ్యానంలో వివరిస్తూ.. 2013వ సంవత్సరం శ్రీ గిడుగు వెంకటరామమూర్తి నూటయాభయ్యవ జయంతి సంవత్సరం కావడం పురస్కరించుకొని ఈ సాంస్కృతికోత్సవాన్ని “గిడుగు” వారికి అంకితం చేసి వారిపట్ల తమకున్న గౌరవాన్ని చూపించుకొన్నారు. యనగండ్ల నాగ్ కార్యదక్షత, అక్కల మోహన్ కార్యక్రమ నిర్వహణ నైపుణ్యం, నసీం షేక్ సాంస్కృతిక సృజనాత్మకత, మడక ప్రేమకుమార్ మరియు సుసర్ల ఫణీంద్ర భోజన ఏర్పాట్లలో సహనం, ఆప్యాయతతో కూడిన నేర్పు, జొన్నాడ వెంకట్ మరియు శీరం జగదీశ్ వీడియో మరియు ఆడియో కుశలత, పాలూరి సుజన గారి ఆర్థిక వనరుల సేకరణ వ్యూహం, మరియు రాయవరం విజయ భాస్కర్ ఇంకా దాదాపు వందమంది సాంస్కృతిక సైనికుల సహాయంతో ఈ కార్యక్రమం ఒక పెద్ద పండుగలా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇష్టా భోజనశాల వారు మహాపోషకదాతగా సహకరించారు.

మొట్టమొదటి సారిగా అంతర్జాలంలో ప్రత్యక్ష ప్రసారం చెయ్యబడిన ఈ కార్యక్రమంలో, నాలుగేళ్ళ నుంచి పదహారేళ్ళ వయసున్న మనబడి పిల్లలు తాము మనబడిలో నేర్చుకొన్న తెలుగు విద్యను, నైపుణ్యాన్ని సంధానకర్తలుగా ప్రసంగాల దగ్గరనుంచి, చిట్టి చిట్టి గేయాలు, ఉత్తేజభరితమైన దేశభక్తి గేయాలతో, సంప్రదాయ నృత్యాలు, బుర్రకథలతో, జానపద బాణీలతో - మన బాలబాలికలేరా బాలీవుడ్ స్టార్లు - అన్న రీతిలో ప్రేక్షకులని అలరించారు. “ప్రవాసమేరా ఆంధ్రసరస్వతీ నివాసమని” మరోసారి నిరూపించారు. సకలసాంకేతిక హంగులతోకూడిన సువిశాలప్రాంగణములో, అత్యంత ఆహ్లాదభరితమైన వాతావరణములో, అద్భుతమైన అలంకారాలతో సుశోభితమైన వేదికపై, వేదమంత్రాలనడుమ కార్యక్రమము ఖచ్చితముగ ఒంటిగంటన్నరకి మొదలైనది. మనబడి బాలబాలికలు, అధ్యాపకులు, కార్యనిర్వహణవర్గము కలిసి, ఒకేసారి వేదికమీద వందేమాతరగీతము ఆలపించగా - సువిశాలభారతావనియే వచ్చి నిలిచినదా - అని అవలోకించిన ఆహూతులకు అనిపించకమాని ఉండదు. అతి ప్రాచీనమైన తెలుగు భాషను ప్రపంచభాషగా మార్చటమనే బృహత్కార్యక్రమానికి సంకేతముగా, పెద్దలచేతులలో మొదలైన మనబడి తెలుగు భాషాజ్యోతి, సభాప్రాంగణములోనిండిఉన్న బాలబాలికలు మరియు పెద్దల కరస్పర్శతో మరింత తేజోదీప్తమైనది. వచ్చిన అతిథులని ఇష్టా భోజనశాల వారి రుచికరమైన వంటలతో మధ్యాహ్న భోజనం, చిరుతిండి గా పిజ్జాలు సమోసాలు , మళ్ళీ రాత్రి పసందైన తెలుగు భోజనం ఆప్యాయంగా పెట్టడమే కాక, “భాగ్యలక్ష్మి బహుమతుల కేంద్రం” ద్వారా వేల డాలర్లు విలువజేసే కానుకలు గెలుచుకొనే అవకాశం కలిగించి సరదా వాతావరణంలో సందడి సందడిగా సభ సాగింది!

ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిలికానాంధ్ర వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్ గారు, మనబడి కులపతి చమర్తి రాజు గారు, తమ సందేశంలో మనబడి లక్ష్యాలు, చేరుకొన్న ఫలితాలు, చేరబోయే గమ్యాల గురించి వివరించి సాటి తెలుగువారినందరినీ ఈ మనబడి ఉద్యమంలో భాగస్వాములుకమ్మని పిలుపునిచ్చారు. ఇంకా మనతరం (మనబడి గత విద్యార్థుల సంఘం) కార్యక్రమం గురించి, ఏప్రిల్-మే నెలలలో దేశమంతటా జరగబోయే “తెలుగు మాట్లాట” తెలుగు భాషాపోటీల గురించి చెప్పి, పిల్లలో పోరాటపటిమని తెలుగు భాష మీద పట్టు పెంచడానికి మార్గంగా రూపొందించిన ఈ పోటీలలో పిల్లలని చురుగ్గా పాల్గొనేలా చెయ్యమని తల్లితండ్రులకి విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఈ సంవత్సరం ఉత్తీర్ణులు కాబోయే ప్రభాసం విద్యార్థుల్ని , ఈ పెద్ద వేదిక మీద గుర్తించి, ఆ పిల్లలికి వేదప్రోక్త

# సిలికానాంధ్ర మనబడి సాంస్కృతికోత్సవం 2013 – డాలస్ – సమీక్ష

*సమీక్షకులు - రాయవరం విజయ భాస్కర్, కాజ సురేశ్*

వచనాలతో వారి బంగరు భవిష్యత్తుకోసం ఆశీస్సులిచ్చారు. టెక్సాసు రాష్ట్రంలో ప్రతీ ఏడాది రెట్టింపు సంఖ్యతో మనబడిని పెంపు చేస్తున్న జట్టుకి, ఉపాధ్యాయులకి, మనబడి బాలానందం జట్టుకి, మనతరంలోని బాలగురువులకి వేదికపై గుర్తింపునిచ్చారు.

ముందుగ బుడిబడి అడుగుల బాలబడి బుల్లిపాపలు - చుకుచుకు రైలు వస్తుంది, చిట్టి చిలకమ్మ, చందమామ రావే - లాంటి పాటలతో, ముద్దు ముద్దు చేష్టలతో అతిథులను విశేషముగా అలరించారు. ప్రవేశము, ప్రసూనము తరగతులవారు ఆలపించిన - శ్రీలు పొంగిన జీవగడ్డై, జయతు జయతు భారతమాత, తేనెల తేటల మాటలతో మనదేశమాతనే కొలిచెదమా, దేశమంటే మట్టికాదోయ్-దేశమంటే మనుషులోయ్" లాంటి దేశభక్తిగేయాలు భారతావనిప్రభలను మరొక్కసారి అందరికి గుర్తుచేసాయి. "కడలి అంచులు దాటి ఎగసింది తెలుగు", "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" లాంటి అజరామర గేయాలనాలాపించి ఈ చిన్నారి బాలలు మన తెలుగుతల్లికి మరోసారి పట్టం కట్టారు. తేనెలొలుకు తేటతెనుగుభాష, వీరికే సొంతమైన విన్నూత్న స్వరంలో ఇమిడి మరింత శ్రావ్యమైనది. ఒక మనబడి తండ్రి, కాజ సురేశ్ "చిన్నారి పొన్నారి చిట్టిపాపలనోట తేనెనింపెడి శారదీ మనబడి - కమ్మనిగుమ్మపాలమ్మమాటలు గుమ్మరించు సుధేనుశాలీ మనబడి"

తుమ్మెదలున్నాయేరా!! ఓరోరి బంగారు మొగుడా, గుమ్మాడమ్మా గుమ్మడి లాంటి జానపద గేయాలు, కోలాటంనృత్యాలు, బుర్రకథలు అతిథులను మంత్రముగ్ధులను చేసాయి. భాషాభిమానులైన ముగ్గరు తెలుగువాళ్ళ ప్రయాణాన్ని వాళ్ళ పిల్లలకి తెలుగునేర్పించాలి అన్న తపనకి సిలికానాంధ్ర కన్న కల "మనబడి" కథని బుర్రకథలా అద్భుతమైన స్వరాలతో ఆలపించి అమెరికాలో పుట్టినా సరే, తెలుగునాట కనుమరుగవుతున్న అరుదైన కళలలో ఒకటైన బుర్రకథ తీరుని ఆకళింపు చేసుకొని "మనతరం" విద్యార్థులు ప్రదర్శించిన వైనం ప్రేక్షకులని ఉర్రూతలూగించింది. శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలను అనర్గళముగా ఆలాపించిన చిన్నారి బాలలను చూసి భావితరాల చేతులలో తెలుగు పదిలముగా ఉండబోతోందనే ధైర్యము అందరి మనసులలోనూ నిండింది. కుందేలు తెలివి, అపాయంలో ఉపాయం, గుడ్డివాళ్ళు ఏనుగు, మంత్రపు మామిడి చెట్టు, ఉగాది ప్రత్యేకత, నేనే పెద్ద, చెడ్డవాళ్ళకు దూరముగా ఉండాలి, సమయస్ఫూర్తి లాంటి సందేశాత్మక నాటికలు అందరిని ఆహ్లాదపరిచి ఆలోచింపజేసాయి. పరంధామయ్య శిష్యులకథ, మనబడి సరాగాలు, మనబడిలో సరదాగా, సరదా సందడి, నవ్వుల హరివిల్లు లాంటి హాస్యభరిత నాటికలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ పిల్లలు భవిష్యత్తులో తెలుగులో ఎటువంటి తరహాలో విషయ సేకరణ చేస్తారు, రచనలు చేస్తారు అన్నదానికి ఉదాహరణగా తూర్పు ప్లేనో ప్రభాసం విద్యార్థులు అందించిన సాంకేతిక దృశ్య శ్రవణ ప్రదర్శనలో మన భాగ్యనగర విశేషాలు చెప్పిన తీరు, వారి సృజనాత్మకతకి అద్దం పట్టింది. రమ్యమైన స్వరాలతో "చక్కర కలిపిన తియ్యని కమ్మని తోడు పెరుగు తెలుగు", పాట సాగింది. చివరిగా వందన సమర్పణ , జాతీయగీతాలాపనతో ఈ అందమైన తెలుగు పండుగకి తెర పడింది. తెలుగుభాష ఉజ్జ్వల సువర్ణ చరిత్రలో మరొక్క అధ్యాయం లిఖించబడింది. కవి కాజ సురేశ్ పలుకులలో - " తెలుగు తేజోసుధాబ్ధీ మనబడి - ప్రాచీన భాషనర్వాచీనవిశ్వవిస్తీర్ణ పరచు వారధీ మనబడి - సంప్రదాయమున్ సంస్కృతిన్ సన్నుతించు కట్టుబొట్టుల మేల్బడా!! కాదది, మన యాంధ్ర భాషాభివృద్ధికే యమృతఝరము!!! మనది మనకోసమే పుట్టె మన మనబడి!!